# ఏటూరునాగారంలో నేడు కేటీఆర్ రోడ్‌షో

- బస్టాండ్ సెంటర్‌లో కార్నర్ మీటింగ్
- భారీ జన సమీకరణకు ఏర్పాట్లు
- కుమ్రంభీం స్టేడియంలో హెలిప్యాడ్ ఏర్పాటు
- బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం, నవంబర్ 26 : ఈనెల 27న(సోమవారం) ఏటూరునాగారంలో మంత్రి కేటీఆర్ రోడ్డు షోను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్నం మూడు గంటలకు హెలికాప్టర్‌లో కుమ్రంభీం స్టేడియానికి రానున్నారని తెలిపారు. అక్కడ నుంచి క్రాస్ రోడ్డు, వై జంక్షన్, ఆకుల వారిఘనపూర్ మీదుగా బస్టాండు వరకు రోడ్డు షోలో పాల్గొంటారని పేర్కొన్నారు. బస్టాండు సెంటర్‌లో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించనున్నట్లు తెలిపారు. అందుకోసం అన్ని మండలాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు హాజరు కావాలని సూచించారు. ఈనెల 24న ములుగులో సీఎం సభకు తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో నాగజ్యోతి విజయం ఖాయమైందన్నారు. సీఎం కేసీఆర్ జిల్లాకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. పార్టీ ఎమ్మెల్యే లేకపోయినా ములుగును జిల్లాగా, మల్లంపల్లి మండలం, ఏటూరునాగారంలో రెవెన్యూ డివిజన్, అగ్నిమాపక కేంద్రం, ములుగులో మెడికల్ కళాశాలను మంజూరు చేయడం హర్షణీయమన్నారు. జీపీగా ఉన్న ములుగును జిల్లాగా ప్రకటించడం చరిత్రలో మర్చిపోలేమన్నారు. బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ మాత్రమేనని అన్నారు. మ్యానిఫెస్టోలో లేని వాటిని కూడా సీఎం అమలు చేస్తున్నారని తెలిపారు. బడే నాగజ్యోతి గెలుపు ములుగుకు వెలుగుగా మారుతుందన్నారు. ములుగు జిల్లా అభివృద్ధి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. సమావేశంలో ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, కాకులమర్రి చిట్టిబాబు, వలీబాబా, కోట నర్సింహులు, సర్దార్‌పాషా, చందర్‌బాబు, కూనూరు మహేశ్, జాడి భోజారావు, సప్పిడి వెంకట్రాం నర్సయ్య, కలీల్, గండపెల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### హెలిప్యాడ్ స్థల పరిశీలన

ఏటూరునాగారం : మండల కేంద్రానికి నేడు మంత్రి కేటీఆర్ రానున్న సందర్భంగా కుమ్రమభీం స్టేడియంలో హెలిప్యాడ్ ప్రదేశాన్ని ఏఎస్పీ సంకీర్త్, సీఐ రాజు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారావు పరిశీలించారు. హెలికాప్టర్ ల్యాండ్ కావడానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు. క్రాస్ రోడ్డు నుంచి బస్టాండ్ వరకు ఎస్సై కృష్ణ ప్రసాద్ ఇంటింటా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు సునీల్‌కుమార్, నాయకులు చిట్టిబాబు, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, వలీబాబా, సప్పిడి రాంనర్సయ్య, కోనేరు నగేశ్, కూనూరు మహేశ్, గండపెల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దు

ములుగు, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికలకు ఆటంకం కలిగించేందుకు ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన మావోయిస్టు యాక్షన్ టీమ్ ములుగు జిల్లాలో సంచరిస్తున్నదని, అసాంఘిక శక్తులకు ప్రజలు ఆశ్రయం కల్పించొద్దని ఎస్పీ గౌష్ ఆలం సూచించారు. గ్రామాల్లో అనుమానితులు కనిపించినట్లయితే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీస్ శాఖ తిప్పి కొట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. ఎన్నికలను విజయవంతం చేసేందుకు ప్రజలు అన్ని విధాలుగా తమకు సహకరించాలని ఎస్పీ పేర్కొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత

**భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**

భూపాలపల్లి రూరల్, నవంబర్ 26 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్ట్ ప్రభావిత, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా పోలీసులతో పాటు, దాదాపు 1000 మంది కేంద్ర సాయుధ బలగాలు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసుల సేవలను ఎన్నికల్లో వినియోగించుకుంటున్నామన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లాలోని ప్రతి ప్రాంతాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మావోయిస్టులు జిల్లాలోకి ప్రవేశించకుండా గోదావరి పరివాహక ప్రాంతంతో పాటు, ఫెర్రీ పాయింట్ల వద్ద గట్టి భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రతా పరంగా పకడ్బందీ చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు.

# రాష్ట్రంలో వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

- పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరికలు

ములుగు రూరల్, నవంబర్ 26 : రాష్ట్రంలో అన్ని సర్వేలు బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని తేల్చాయని, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ములుగు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ములుగులోని బీఆర్‌ఎస్ భవన్‌లో జీవంతరావుపల్లి పరిధిలోని గణేశ్‌లాల్‌పల్లికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన100 మంది కార్యకర్తలు, నాయకులు, మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా వెంకటాపూర్ మండలం నర్సాపురం పీఏసీఎస్ డైరెక్టర్లు ఊకంటి సాంబశివరెడ్డి, మేకల రవిచంద్ర పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం, దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని మ్యానిఫెస్టోలో పొందుపర్చామన్నారు. బడే నాగజ్యోతిని భారీ మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మాడుగుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### నాగజ్యోతి గెలుపునకు కృషి చేయాలి

గోవిందరావుపేట : ములుగు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం నాయకులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగజ్యోతి గెలుపు కోసం ప్రతి కార్యకర్త నిరంతరం కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కారు గుర్తుకు ఓటు వేసేలా చూడాలన్నారు. నేడు ఏటూరునాగారంలో నిర్వహించే కేటీఆర్ రోడ్ షో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు సాయికుమార్, జడ్పీటీసీ హరిబాబు, వైస్ ఎంపీపీ సూదిరెడ్డి స్వప్న, రైతు బంధు కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు భూక్యా దేవానాయక్, టీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. బీఆర్‌ఎస్ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపు కోసం రాజకీయాలకతీతంగా వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారన్నారు.



గోవిందరావుపేట : బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి



ములుగులో..



తెల్లం వెంకట్రావుకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

## ఆశీర్వదించండి.. మీకు సేవకుడిగా ఉంటా..

- పోడు భూముల సమస్య పరిష్కరించిన సీఎం కేసీఆర్
- బీఆర్‌ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు

భద్రాచలం, నవంబర్26 : నన్ను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించండి.... మీకు సేవకుడిగా ఉంటానని బీఆర్‌ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు కోరారు. ఆదివారం ఆయన పట్టణంలోని రాజుపేటతో పాటు పలు కాలనీల్లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికుడిని తనను గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ చీకటి రోజులు వస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే మూడు గంటలు కరెంట్ చాలంటున్నారు.. వారు వస్తే జనరేటర్లు, ఇన్వెర్టర్లు వాడకం తప్పదన్నారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తుందన్నారు. రెండు దఫాలుగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిందేమీ లేదని విమర్శించారు. భద్రాచలం ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా భ్రష్టు పటించారని ఆరోపించారు. స్థానికుడు కాకపోవడంతో ఇక్కడి సమస్యలపై ఆయనకు అవగాహన లేదన్నారు. దీంతో నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగ ఉందన్నారు. ఒక్కసారి తనకు అవకాశమిస్తే సీఎం కేసీఆర్‌తో మాట్లాడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పోడు భూముల సమస్యను సీఎం కేసీఆర్ పరిష్కరించిన విషయం గుర్తు చేశారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కోరారు. దుమ్ముగూడెం వద్ద నిర్మిస్తున్న సీతమ్మ బరాజ్ వల్ల ఎన్నో వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. అలాగే 320 మెగావాట్ల సామర్థ్యం గల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు.

### ప్రచారంలో ప్రజల ఆదరణ

బీఆర్‌ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు ప్రజలు ఆదరిస్తున్నారు. హారతులు ఇచ్చి ఆశీర్వదిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెల్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, రత్నం రమాకాంత్, ఎండీ నవాబ్, ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు దారపునేని రాంబాబు, దుద్దుకూరి సాయిబాబా, నర్రా రాము, తాండ్ర రమణ, తాండ్ర నరసింహారావు, రేపాక పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

## 7 పోస్టల్ బ్యాలెట్ బూత్‌ల ఏర్పాటు

**భూపాలపల్లి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా**

భూపాలపల్లి రూరల్, నవంబర్ 26: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటెయ్యడానికి వీలుగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ భవేశ్ మిశ్రా పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 7 పోస్టల్ బ్యాలెట్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో రెండు బూతులు భూపాలపల్లి అసెంబ్లీ నియోజక వర్గం, రెండు బూత్‌లు ఉమ్మడి వరంగల్ జిల్లా నియోజక వర్గాలు, రెండు బూత్‌లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నియోజక వర్గం, 1 బూత్ ఇతర నియోజక వర్గాలకు కేటాయించినట్లు వెల్లడించారు. పోలీస్ సిబ్బంది కోసం ఓల్డ్ జిల్లా పోలీస్ కార్యాలయంలో 1 పోస్టల్ బ్యాలెట్ బూత్ ఏర్పాటు చేశామన్నారు. భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 656 మంది, ఇతర నియోజక వర్గాల నుంచి 1,832 మంది, మొత్తం 2,488 మంది ఫారం 12 సమర్పించిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌లను పొందినట్లు పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా పోస్టల్ బ్యాలెట్ రాని వారికి నవంబర్ 28, 29న పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు ఇతర నియోజక వర్గాల నుంచి ఇంకా రావాల్సి ఉందని, దానిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీడబ్ల్యూవో నాగేశ్వర్‌రావు, సీపీవో సామ్యూల్, డీఎఫ్‌వో అవినాశ్, డీపీవో ఆశాలత, ఎంపీడీవోలు, ప్రభుత్వ టీచర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.